సాక్షి
ప్రకాశం
శనివారం । 29 । మార్చి । 2025



ప్రభుత్వ భవనాలు..పన్ను కట్టలేదహో..!

జిల్లాలో ప్రభుత్వ భవనాల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. 18.20 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

- IIలో..



కంకరలో మాయ.. మోసమిదయ్యా..!

ఉపాధి హామీ పథకం కింద బేస్తవారిపేట నియోజకవర్గంలో చేపడుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తోంది. నాసిరకంగా పనులు చేస్తున్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
42.4/24

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

రంజాన్ వేళలు

శనివారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 27	
ఆదివారం	సహోరి	
ఉదయం	గం 4 : 46	

న్యూస్‌రీల్

వల్లూరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.23.45 లక్షలు



వల్లూరులో వల్లూరమ్మ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన వల్లూరు గ్రామంలో వేంచేసిన వల్లూరమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం హుండీలు లెక్కించారు. మొత్తం 119 రోజులకు గాను 10 హుండీలు లెక్కించగా రూ.23,45,461 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బి.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, ఈఓ కోయా మోహనరావు, ఆలయ అర్చకులు, సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

ఒంగోలు సిటీ: పదో తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 29,621 మందికి గాను 29,387 మంది హాజరయ్యారు. 234 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 68 మందికి గాను 46 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో 183 సెంటర్లను కేటాయించారు. డీఈఓ కిరణ్‌కుమార్ 5 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 83 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్‌స్కూల్ సొసైటీ పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్షకు మొత్తం 1377 మందికి గాను 879 మంది హాజరయ్యారు. 498 మంది గైర్హాజరయ్యారు. 23 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ తనిఖీలు చేశారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చందలూరు విద్యార్థి



మాగులూరి ప్రేమ్‌కుమార్

దర్శి: ఆంధ్రప్రదేశ్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర పోటీల్లో చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో 8వ తరగతి విద్యార్థి మాగులూరి ప్రేమ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 26వ తేదీ గుంటూరు జిల్లా తెనాలి మినీ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటాడు. ప్రతిభ కనపరిచిన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు జీ గురుప్రసాద్, పీడీ సోము అంజిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఫ్యామిలీ కోర్టు ఏపీపీగా పాలపర్తి శీనారెడ్డి



పాలపర్తి శీనారెడ్డి

ఒంగోలు: ఫ్యామిలీ కోర్టు, 8వ అదనపు జిల్లా జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పాలపర్తి శీనారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన సంతనూతలపాడు మంగమూరు నివాసి. స్థానిక శర్మా కాలేజీలో డిగ్రీ, ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో న్యాయ విద్యను పూర్తిచేశారు. 1995 వ సంవత్సరం నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఈయన ఈ హోదాలో మూడేళ్ల పాటు విధులు నిర్వహించనున్నారు. నెలకు రూ.40 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

1న పదో తరగతి సోషల్ పరీక్ష

ఒంగోలు సిటీ: ఈ నెల 31వ తేదీ జరగాల్సిన పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్షను ఏప్రిల్ 1వ తేదీ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

మోరాయిస్తున్న గంటలు
ఆరని మంటలు



కంభం ఫైర్ స్టేషన్‌లో ఉన్న ఫైర్ ఇంజన్ బండి 22 ఏళ్ల క్రితంది. కాలంచెల్లిన ఈ వాహనం తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఈ కేంద్రం పరిధిలో ఉన్న అర్థవీడు, కంభం, బేస్తవారిపేట మండలాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సకాలంలో వేగంగా ఘటనా స్థలానికి చేరుకోలేని పరిస్థితి ఉంది.

దోర్నాల అగ్నిమాపక కేంద్రంలో ఉన్న వాహనం పాతది. దాదాపు నెల రోజుల కిందట మరమ్మతులకు గురైంది. ఇప్పటికీ రిపేరు చేయలేదు. యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉన్నాయి. అంతేకాకుండా నల్లమల అటవీ ప్రాంతం కూడా విస్తరించి ఉంది. వేసవి కాలంలో తరుచూ అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.

- అగ్నిమాపక శాఖలో వెంటాడుతున్న సమస్యలు
- పాత వాహనాలతో ఇబ్బందులు
- కనిగిరిలో ఒక్క కేంద్రంతో అవస్థలు
- ఏడాది కాలంలో జిల్లాలో 548 ఫైర్స్ కాల్స్
- కాపాడిన ఆస్తి విలువ రూ.15.74 కోట్లు

మార్కాపురం: జిల్లాలో అగ్నిమాపక శాఖను సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాలు ఉన్నాయి. అందులో కొన్ని కాలం చెల్లిన వాహనాలు ఉన్నాయి. వేసవి కాలం ఎక్కువ అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా వివిధ కారణాలతో జరుగుతున్న అగ్ని ప్రమాదాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంకా 3 నెలల పాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. ఉన్నంతలో అధికారులు సేవలందిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 548 ఫైర్ కాల్స్ వచ్చాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి కాపాడిన ఆస్తి విలువ సుమారు రూ.15.74 కోట్లు. ఒక్క మార్కాపురం ఫైర్‌స్టేషన్ పరిధిలో 2 నెలల వ్యవధిలో 25 ఫైర్ కాల్స్ వచ్చాయంటే అగ్ని ప్రమాదాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వరుస సంఘటనలు, రైతులు, ప్రజలను కలవరపరుస్తున్నాయి.

కనిగిరిలో ఒక్కటే :

కనిగిరిలో అగ్నిమాపక కార్యాలయం పరిధిలో ఆరు మండలాలతో పాటు కొండేపి, మార్కాపురం నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలున్నాయి. అగ్ని మాపకవాహనం పరిధిలో సుమారు 65 కిమీల దూరం వస్తోంది. ఒకే సారి రెండు చోట్ల ప్రమాదాలు జరిగే ఇబ్బంది పడే పరిస్థితి. నియోజకవర్గంలోని పామూరు కేంద్రంగా మరో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు, పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రతి పాదనలు ముందుకు సాగలేదు. పామూరు ప్రతి పాదన పూర్తి స్థాయిలో మరుగున పడింది. ఒకే సారి రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తే కందుకూరు, కొండేపి, కంభం అగ్ని మాపక వాహనాలు వచ్చే వరకూ ఎదురుచూడాల్సిందే.

రెస్క్యూ టీముతో సత్వర సేవలు:

ఒంగోలులో రెస్క్యూ టెండర్ టీము ప్రత్యేకంగా ఉంది. ఈ టీము హైవేరోడ్డు పరిధిలో యాక్సిడెంట్ జరిగి ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు, అలాగే నీటికుంటల్లో, సముద్రాల్లో ఈతకు వెళ్లి ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పుడు రెస్క్యూ టెండర్ టీము సభ్యులు ప్రాణాలు కాపాడతారు.

ఏటా అవగాహన కార్యక్రమాలు:

ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిప్రమాదాల వారోత్సవాలు నిర్వహిస్తారు. అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, స్కూల్స్, హాస్పిటల్స్, గ్యాస్ గోడౌన్‌లు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, అపార్ట్‌మెంట్లు, సినిమా హాల్స్, విద్యుత్‌శాఖ కార్యాలయాలు, కళాశాలలో, పెట్రోల్ బంకులు తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక శాఖాధికారులు డెమోలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.

జిల్లాలో 10 అగ్నిమాపక కేంద్రాలు ఇలా..

మార్కాపురం, ఒంగోలు, టంగుటూరు, కొండపి, కనిగిరి, కంభం, గిద్దలూరు, వైపాలెం, దోర్నాల, దర్శిలలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. జిల్లాలో మూడు మిస్ట్ బుల్లెట్లు ఉన్నాయి. ఒంగోలులో రెస్క్యూ టెండర్ వాహనం ఉంది. ఏదైనా అగ్నిప్రమాదం జరిగి వాహనంలో మనుషులు ఇరుక్కున్నప్పుడు వారిని రక్షించేందుకు రెస్క్యూ టెండరు వాహనం ఉపయోగపడుతుంది. అలాగే స్విమ్మర్స్ కూడా ఉన్నారు.

ప్రమాదాలకు కారణాలు

నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడకపోవడం, ఎలక్ట్రికల్ వైరింగ్ జాయింట్‌లు ఉండిపోవడం, చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు అందుబాటులో ఉంచడం, కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు చల్లార్చకుండా పక్కన పడేయడం. వంటింట్లో గ్యాస్ లీకవుతున్నా గమనించకపోవడం, మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయడం, ఇలాంటి వాటి వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏడాదిలో ఇలా..



మార్కాపురం అగ్నిమాపక శాఖాధికారి పరిధిలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 25 వరకూ 67 ఫైర్‌కాల్స్ వచ్చాయి. సకాలంలో సిబ్బంది వెళ్లి మంటలను వ్యాపించకుండా అదుపుచేయడం వలన సుమారు రూ.2.45 కోట్ల ఆస్తిని కాపాడారు. ప్రధానంగా గత నెలలో 17, ఈనెలలో 18 ఫైర్ కాల్స్ వచ్చాయి.

- ఈ ఏడాది జనవరి 8న మర్రిపాలెంలో పొగాకు బ్యారన్ దగ్ధమైంది.
- ఈ ఏడాది జనవరి 11న కొనకనమిట్ల మండలం నాగంపల్లిలో పొగాకు బ్యారన్ అగ్నికి ఆహుతైంది.
- ఫిబ్రవరి 9న కొనకనమిట్ల మండలం చౌటపల్లిలో వరిగడ్డి వాము దగ్ధమైంది.
- మార్చి 1న మార్కాపురం పట్టణ శివార్లలోని ఎస్టేట్‌లోని గోడౌన్‌లో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు లక్షల ఆస్తి నష్టం సంభవించింది.
- మార్చి 13న మార్కాపురం పట్టణ శివార్లలోని అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో గోశాల దగ్ధమైంది.
- మార్చి 20న పామూరు మండలం కంభాలదిన్నెలో అగ్నిప్రమాదం జరిగి 100 ఎకరాల్లో కందిపంట దగ్ధమైంది.
- మార్చి 27వ తేదీన మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో పెయింట్ షాపు గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగి సుమారు 25 లక్షల పైగా ఆస్తినష్టం వాటిల్లింది.



మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వంటింట్లో మహిళలు జాగ్రత్తలు పాటించాలి. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు పడేసేముందు ఆర్పివేసి పడేయాలి. ఎలక్ట్రికల్ పాయింట్లు ఓవర్‌లోడ్ చేయవద్దు. అగ్నిప్రమాదం జరిగితే చల్లార్చేందుకు నీరు అందుబాటులో ఉంచుకోవాలి. ఫ్యాక్టరీల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఎమర్జెన్సీ చర్యలు తీసుకోవాలి. గడ్డివాములు నివాస గృహాలకు కనీసం 60 అడుగుల దూరంలో ఉండాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి.

– శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసరు, ఒంగోలు

జాగ్రత్తలు పాటించండి



ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఇంటిలో సురక్షితమైన విద్యుత్ పరికరాలు వాడాలి. ఎలక్ట్రిక్ పాయింట్లలో ఓవర్‌లోడ్ వద్దు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పివేసి యాష్ ట్రేలో వేయాలి. గోడౌన్‌లు, ఫ్యాక్టరీలో, గ్యాంగ్ వే, క్రాస్ సెక్షన్‌లు ఉంచాలి. మండే స్వభావం ఉన్న డస్ట్ చేరకుండా చూసుకోవాలి. ఫైర్ అలారమ్, స్మోక్ డిటెక్టర్లను, ఆటోమెటిక్ స్ప్రింక్లర్లను ఉపయోగించుకోవాలి. ఆవరణలో చెత్త, చెదారం లేకుండా చూసుకోవాలి. దుస్తులకు నిప్పు అంటుకుంటే నేలపై దొర్లి దుప్పటి చుట్టుకోవాలి. నీటి సౌకర్యం అందుబాటులో ఉంచుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం అందిస్తే తక్షణమే స్పందించి మంటలను చల్లార్పుతున్నాం.

– ఆర్ రామకృష్ణ, మార్కాపురం ఫైర్ అధికారి

విద్యుత్ సర్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలి



విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: నిరుపేద సామాన్యులకు తలకుమించిన భారంగా మారిన విద్యుత్ సర్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. విద్యుత్ సర్‌చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ సంస్కరణలు, సెకీ ఒప్పందాలకు వ్యతిరేకంగా స్థానిక విద్యుత్ భవనం వద్ద సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చినప్పుడు మరోమాట మాట్లాడుతుందని, ఇదే రీతిలో వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడంటూ రచ్చ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటలను అటకెక్కించి ప్రజల మీద రూ.15,484 కోట్ల భారం వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల సంపదను దోచుకొని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసిన చంద్రబాబు మొదటిసారి విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ప్రజలపై పెనుభారాన్ని మోపడంతో తిరుగుబాటు వచ్చిందని చెప్పారు. ఆనాటి పరిణామాల తరువాత చంద్రబాబును ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. దాంతో పదేళ్లపాటు ఏ ప్రభుత్వం కూడా విద్యుత్ జోలికి పోవడానికి సాహసించలేదన్నారు. విద్యుత్ సంస్కరణల కారణంగా గత 25 ఏళ్లలో ప్రజల మీద లక్ష కోట్ల రూపాయల భారం పడిందని తెలిపారు. కంపెనీలకు లాభాలు చేకూర్చేలా ప్రజలపై భారాలు మోపడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఒకవైపు ఇంధన సర్‌చార్జీలు, ట్రూ అప్ చార్జీలు కట్టలేక ప్రజలు అల్లాడిపోతుంటే మరోవైపు టైమ్ ఆఫ్ డే పేరుతో విద్యుత్ డిమాండ్ ను అనుసరించి అదనపు భారం వేసే కుట్రలకు తెరదీయడం దుర్మార్గం అన్నారు. పార్టీ జిల్లా నాయకుడు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుపై చేపట్టిన ప్రజాభిప్రాయాన్ని కూటమి ప్రభుత్వం గౌరవించలేదన్నారు. విద్యుత్ చార్జీల భారం ప్రజల మీద వేస్తే గతంలో చెప్పినట్లు ఇప్పుడు కూడా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.రమాదేవి, పి.కల్పన, బి.బాలకోటయ్య, చీకటి శ్రీనివాసరావు, రమేష్, బివి రావు, దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫైడే



నందనమారెళ్ల ఏరియా

- మండుతున్న ఎండలు
- నందనమారెళ్లలో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత

కనిగిరిరూరల్: వేసవి తీవ్ర రూపం దాల్చుతోంది. భానుడు భగ భగ మండుతున్నాడు. అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలు అల్లాడుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, విద్యార్థుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. వాతావరణ శాఖ వెల్లడించిన నివేదిక ప్రకారం శుక్రవారం కనిగిరి మండలంలోని నందనమారెళ్లలో అత్యధికంగా 42.4 డిగ్రీలు, అత్యల్పంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పునుగోడులో అత్యధికం 41.5, అత్యల్పం 27.7, కనిగిరి పట్టణంలో అత్యధికం 41.3, అత్యల్పం 24, మార్కాపురంలో అత్యధికం 41, అత్యల్పం 25 డిగ్రీలు, గురువాజీపేటలో అత్యధికం 40.7, అత్యల్పం 21.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నకిలీ వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: అవినీతి నిరోధక శాఖ అధికారులం, ఆర్టీఐ యాక్ట్, మీడియా ప్రతినిధులు, మానవ హక్కుల సంఘాల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్న నకిలీ వ్యక్తులతో ప్రజలు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అవినీతి నిరోధక శాఖ అధికారులమంటూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న రిజిస్ట్రేషన్ లేని నకిలీ సంస్థలు, ఆర్టీ యాక్ట్, మీడియా, మానవ హక్కుల సంఘాల పేరుతో కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ పట్ల ఉద్యోగస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్రాల ఆధీనంలోని రిజిస్ట్రేషన్లు కలిగిన, రిజిస్ట్రేషన్లు లేని కొన్ని సంస్థల పేరుతో నకిలీ ఐడీ కార్డులు సృష్టించుకొని తాము ఫలానా సంస్థల నుంచి వస్తున్నామని బెదిరింపు కాల్స్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. సమాచార హక్కుల సంస్థల ప్రతినిధులు, మానవ హక్కుల ప్రతినిధులు స్వచ్ఛందంగా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని, ఎటువంటి బెదిరింపులకు పాల్పడడం, డబ్బులు వసూళ్లు చేయడం నేరమని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఇలాంటి ఫోన్లు వస్తే వెంటనే 9121102266 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

30న ఆకాశవాణిలో కవి సమ్మేళనం ప్రసారం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

మార్కాపురం: మార్కాపురం ఆకాశవాణి కేంద్రంలో ఈ నెల 30వ తేదీన విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకుని కవి సమ్మేళనాన్ని ప్రసారం చేస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణాధికారి పి.ప్రశాంత్ కిరణ్ తెలిపారు. ఉదయం 7.15 గంటలకు కవి సమ్మేళనం ప్రసారం అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కవులు డాక్టర్ కప్పగంతుల మధుసూదనశాస్త్రి, దేవులపల్లి విశ్వనాథం, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, తేళ్ల అరుణ, డాక్టర్ నూనె అంకమరావు, దిట్టకవి శ్రీనివాసాచార్యులు, పావులూరి మల్లికార్జునరావు, ఎం.వెంకట సుబ్బారావు పాల్గొని ఉగాది పండగ విశిష్టతను తెలిపారన్నారు. శ్రోతలు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని రేడియోలో 101.5 మెగాహెర్జ్‌పై వినవచ్చని చెప్పారు. కవి సమ్మేళనానికి డాక్టర్ మధుసూదనశాస్త్రి అనుసంధాన కర్తగా వ్యవహరించారని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో న్యూస్ ఆన్ ఎయిర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడ ఉన్నా మార్కాపురం ఆకాశవాణి ప్రసారాలు వినవచ్చన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థులు



ఇ.హైమావతి



ఎం.దివ్యశ్రీ



డి.శివ నాగలక్ష్మి



ఎస్.పావని

కనిగిరిరూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి ఖోఖో అకాడమీ విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రకాశం జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి భవనం కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు ఒడిశాలోని పూరీలో 57వ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో కనిగిరికి చెందిన ఇ.హైమావతి, ఎం.దివ్యశ్రీ, డి.శివ నాగలక్ష్మి, ఎస్ పావని ఆడనున్నారు. ఈనెల 16న ఉమ్మడి ప్రకాశం జిల్లా జే పంగులూరులో రాష్ట్ర స్థాయి మహిళా ఖోఖో జట్ల ఎంపిక కార్యక్రమం జరిగిందని, ఆ పోటీల్లో ఈ విద్యార్థినులు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. వీరిని పలువురు ప్రజా ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.

1 నుంచి రెండు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో ఆర్‌సీసీ 22వ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీల్లో విజేతలకు బహుమతులు వరుసగా రూ.50,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ కింద రూ.3,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నీలో పాల్గొనేందుకు ఆసక్తిగలవారు తమ జట్టు వివరాలను ఎంట్రీఫీజు రూ.500 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్:9493355202, 7013898748, 6362367650 నంబర్లను సంప్రదించాలన్నారు.



ప్రభుత్వ భవనాలు పన్ను కట్టలేదహో..!

జిల్లాలో పేరుకుపోతున్న ప్రభుత్వ భవనాల ఆస్తి పన్ను
పన్ను డిమాండ్ రూ.18.20 కోట్లు
జమ అయింది రూ.2.30 కోట్లు

మార్కాపురం టౌన్:

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలంటూ అధికారులు పదే పదే ప్రకటనలిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్ను చెల్లిస్తే వడ్డీలో రాయితీ వర్తిస్తుందంటూ మైకుల్లో ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీల నిర్వహణకు పన్నుల రూపంలో సమకూరే ఆదాయం కీలకం కావడంతో సంబంధిత అధికారులు ఆ దిశగా ప్రయత్నిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది కానీ ప్రభుత్వ భవనాల పన్ను వసూళ్లపై మాత్రం అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఆ డబ్బు కట్టాల్సింది ప్రభుత్వమే కావడంతో మున్సిపల్ అధికారులు కూడా డిమాండ్ చేయకుండా మిన్నకుండిపోతున్నట్టుగా తెలుస్తోంది. 'రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తే చెల్లిస్తామ'ని కార్యాలయాల ఉన్నతాధికారులు చెబుతుండటంతో మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది రిక్త హస్తాలతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది.


మార్కాపురం పట్టణ వ్యూ

నోటీసులిచ్చినా స్పందన శూన్యం

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేయాలంటే ప్రజల ఆస్తి పన్నుతోపాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల భవనాల ఆస్తి పన్నుల ఆదాయం కూడా ఎంతో కీలకం. ఆస్తి పన్నుపై వడ్డీ భారం పడుతుందనే భయంతో ప్రైవేట్ వ్యక్తులు మున్సిపాలిటీ ఖజానాకు ముందుగానే పన్ను చెల్లిస్తుంటారు. అలాగే ఖాళీ స్థలం పన్ను, నీటి కుళాయి పన్ను చెల్లించి పట్టణాల అభివృద్ధికి దోహదపడుతున్నారు. అయితే, మున్సిపాలిటీల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల భవనాల ఆస్తి పన్ను మున్సిపాలిటీ ఖజానాలకు జమయ్యే సరికి ఏళ్లకు ఏళ్లు గడిచిపోతున్నాయి. రెవెన్యూ, విద్యాశాఖ, గ్రంథాలయాలు, ఆర్టీసీ, పంచాయతీరాజ్, అంగన్‌వాడీ, ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్లు భవనాలు, ఎక్సైజ్, పోలీస్, పాఠశాలలు, పోస్టల్, టెలిఫోన్ ఎక్సేంజ్, తదితర ప్రభుత్వ శాఖలకు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చినా స్పందన లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ భవనాల పన్ను బకాయిల వివరాలు

జిల్లాలో ఒంగోలు కార్పొరేషన్‌తో పాటు మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, పొదిలి, చీమకుర్తి, దర్శి ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ భవనాల ఆస్తి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఇప్పటి వరకు పన్ను వసూళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

మార్కాపురం మున్సిపాలిటీ
అసెస్‌మెంట్లు 50
పన్ను డిమాండ్ రూ.1.20 కోట్లు
వసూలైంది రూ.18 లక్షలు

చీమకుర్తి నగర పంచాయతీ
అసెస్‌మెంట్లు 64
పన్ను డిమాండ్ రూ.96 లక్షలు
వసూలైంది రూ.7 వేలు

ఒంగోలు నగర కార్పొరేషన్
అసెస్‌మెంట్లు 276
పన్ను డిమాండ్ రూ.15.25 కోట్లు
వసూలైంది రూ.1.93 కోట్లు

దర్శి నగర పంచాయతీ
అసెస్‌మెంట్లు 44
పన్ను డిమాండ్ రూ.19 లక్షలు
వసూలైంది రూ.లక్ష

కనిగిరి నగర పంచాయతీ
అసెస్‌మెంట్లు 51
పన్ను డిమాండ్ రూ.36 లక్షలు
వసూలైంది రూ.5 వేలు

గిద్దలూరు నగర పంచాయతీ
అసెస్‌మెంట్లు 35
పన్ను డిమాండ్ రూ.21 లక్షలు
వసూలైంది రూ.30 వేలు

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ భవనాల బకాయిలు
అసెస్‌మెంట్లు 29
పన్ను డిమాండ్ రూ.59 లక్షలు
వసూలైంది రూ.2 లక్షలు



ఏమైందో..ఏమో?

- ఫోన్ చేసిన కొద్ది సేపటికే..ప్రాణాలు కోల్పోయింది


వాసంతి మృతదేహం


వాసంతి (ఫైల్)

ఒంగోలు టౌన్: వీడియో కాల్ చేసి మాట్లాడిన కొద్ది సేపటికే ఆ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సోమిశెట్టి శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె వాసంతి బీటెక్ చదువుకుంది. ఒంగోలులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగానికి చేరిన ఆమెకు ఇదే నగరానికి చెందిన పగిడి రవి అనే యువకుడితో పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఈ విషయాన్ని తండ్రికి చెప్పింది. అప్పటికే శ్రీనివాసరావు భార్య చనిపోవడంతో అన్నీ తానై పెంచిన కూతురికి పెద్దల సమక్షంలో పెళ్లి చేసి పంపాడు. రవి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తుండటంతో ఆ దంపతులు అక్కడే బీరంగూడలో నివాసం ఉంటున్నారు. వారికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. చెడు వ్యసనాలపాలైన రవికి ఇటీవల ఉద్యోగం పోయింది. ఇదిలా ఉండగా వాసంతి తరుచూ తండ్రి, సోదరితో వీడియో కాల్ చేసి మాట్లాడుతుంది. ఎప్పటిలాగే బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో కూడా తండ్రి శ్రీనివాసరావు, సోదరి ఝాన్సీరాణితో వీడియో కాల్ చేసి మాట్లాడింది. ఈ లోపు ఏం జరిగిందో ఏమోగానీ రాత్రి 12 నుంచి ఒంటి గంట సమయంలో బల్లికురవలోని శ్రీనివాసరావుకు ఫోన్ చేసి మీ అమ్మాయి ఉరి వేసుకొని చనిపోయిందని చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన ఆయన వెంటనే హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద కూతురు ఝాన్సీకి సమాచారం ఇచ్చాడు. ఆమె బీరంగూడకు చేరుకొనేలోపే వాసంతి మృతదేహాన్ని ఆమె భర్త ఒంగోలు తరలించేందుకు అంబులెన్స్ సిద్ధం చేసి ఉంచాడు. స్నేహితుల సహకారంతో రాత్రికి రాత్రి గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని ఒంగోలు తరలించాడు. గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాడు. గురువారం ఒంగోలు చేరుకున్న శ్రీనివాసరావుకు కుమార్తె మృతదేహంపై గాయాలు కనిపించాయి. తన కుమార్తె సాయంత్రం 7 గంటల తర్వాత తనతో వీడియో కాల్ చేసి మాట్లాడిందని, ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని శ్రీనివాసరావు చెబుతున్నాడు. కుమార్తె మృతిపై తనకు అనుమానం ఉందని, పోలీసులు చట్టపరంగా విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం వాసంతి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

రాచర్ల: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాచర్ల మండలంలోని గుడిమెట్ట రైల్వే బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామానికి చెందిన యువకుడు మాగులూరి ప్రసంగి(36) శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గుడిమెట్ట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఉంది. నంద్యాల రైల్వే పోలీసు షేక్.ఖలీల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కంకరలో మాయ.. మోసమిదయ్యా!

సీసీ రోడ్ల నిర్మాణంలో 'కట్టలు' తెగుతున్న అవినీతి

- అర్ధవీడు మండలంలో అడ్డగోలుగా సీసీ రోడ్ల పనులు
- ఉపయోగించేది స్థానిక కంకర.. లెక్కల్లో చూపింది మాత్రం చీమకుర్తి గ్రానైట్ కంకర
- పంచాయతీకి సంబంధం లేకుండా వెండర్ల పేరుతో టీడీపీ నేతల అకౌంట్లకు నిధులు


నెర్రెలిచ్చిన సీసీ రోడ్డు

బేస్తవారిపేట:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్లకు ప్రధాన ఉపాధి వనరుగా మారింది. కేంద్రం నుంచి వచ్చే నిధులను అప్పనంగా కాజేయడానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని మరోమారు ఎంచుకుంది. గతంలో 2014-19 మధ్య టీడీపీ జమానాలో నీరు-చెట్టు పేరుతో ఉపాధి హామీ నిధులను కొల్లగొట్టిన ఆ పార్టీ నేతలు.. ఈ దఫా సీసీ రోడ్ల పేరుతో దండుకునేందుకు పక్కా స్కెచ్ రూపొందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. సంక్రాంతికి పల్లె పండగ పేరుతో భారీగా నిధులను ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి ఉన్నత స్థాయిలో అనుమతులిచ్చారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు మంజూరు చేశారు.

వెండర్ పేరుతో బరితెగింపు

గ్రామ పంచాయతీలకు ఎటువంటి సంబంధం లేకుండా వెండర్ అనే ఆప్షన్ తీసుకొచ్చి, ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్) యాప్ సాయంతో డ్వామా ద్వారా తెలుగు తమ్ముళ్ల బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు పడేలా పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్ఐసీకి వెండర్ ఆప్షన్‌ను జత చేయడంతో నేరుగా టీడీపీ నేతల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి. ఆ విధంగా పర్సనల్ అకౌంట్లకు, వెండర్ అకౌంట్లకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మళ్లించడానికి నిబంధనలు అంగీకరించవు. కానీ ప్రజాధనం కాజేయడానికి కూటమి ప్రభుత్వం బరితెగించి ఇష్టారీతిగా వ్యవహరిస్తోంది.


సీసీ రోడ్లకు వినియోగిస్తోంది మొహిద్దీన్‌పురంలోని ఈ క్వారీ కంకరనే..

అవినీతి ఇలా..

అర్ధవీడు మండలంలో 14 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.50 కోట్లు కేటాయించారు. మొహిద్దీన్‌పురం, మాగుటూరు, కాకర్ల, యాచవరం, దొనకొండ, పాపినేనిపల్లె ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో, పి.కందుకూరు, అర్ధవీడు, నాగులవరం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లలో నాణ్యతకు కాంట్రాక్టర్ తిలోదకాలిచ్చాడు. రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్‌లో అర్ధవీడుకు 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న చీమకుర్తి నుంచి గ్రానైట్ కంకర తెచ్చి వినియోగిస్తున్నట్లు చూపారు. కానీ అర్ధవీడు మండలంలోని అన్ని సీసీ రోడ్లకు మొహిద్దీన్‌పురం సమీపంలోని మిల్లు నుంచి కంకర తెచ్చి వినియోగించారు. స్థానికంగా లభ్యమయ్యే కంకర నాణ్యంగా ఉంటే చీమకుర్తి గ్రానైట్ కంకరను ఎస్టిమేషన్‌లో ఎందుకు చూపించారో అధికారులకే తెలియాలి. కాంక్రీట్ డ్రమ్ మిక్సింగ్ మెషీన్‌లో ఒక్కో దఫాకు 12 బస్తాల సిమెంట్ వినియోగించాల్సి ఉండగా కేవలం 6 బస్తాలే వేసి రోడ్ల నాణ్యతకు పాతరేశారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మించిన తర్వాత 20 రోజులపాటు క్యూరింగ్ చేయాల్సి ఉంది. కానీ సంబంధిత కాంట్రాక్టర్ క్యూరింగ్ సక్రమంగా చేయకుండా వదిలేశారు. దీంతో కొన్ని చోట్ల ప్రజలే తమ ఇళ్ల ముందు నాలుగు రోజులపాటు క్యూరింగ్ చేసుకున్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామంలో బాగున్న పాత సీసీ రోడ్డుపై కొత్త రోడ్డు నిర్మించి రూ.10 లక్షల ప్రభుత్వ నిధులు వృథా చేశారని చర్లో దొనకొండ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైగా ఈ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సిమెంట్ తక్కువగా వినియోగించడంతో కొద్ది రోజులకే కంకర పైకి తేలింది. రోడ్డుపై పగుళ్లు కూడా ఏర్పడ్డాయి. సీసీ రోడ్ల నిర్మాణంపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్నా, కాంట్రాక్టర్ అవినీతిపై ప్రజలు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కిమ్మనడం లేదు.


రోడ్డుపై పరిచిన లోకల్ డస్ట్, చిప్స్


రోడ్లకు వాడుతున్న లోకల్ కంకర

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపురం సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆ స్థలాన్ని మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాలు శుక్రవారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు వస్తాయని చెప్పారు. వచ్చే నెల రెండో తేదీన శంకుస్థాపనకు మంత్రి లోకేష్, అనంత్ అంబానీ వస్తున్నారని పేర్కొన్నారు. భూమి చదును, మంచినీటి వసతి, ఇతర విషయాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు

కుక్కల దాడిలో 7 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రలతో యజమాని

తర్లుపాడు: కుక్కల దాడితో 7 గొర్రెలు మృతి చెందిన సంఘటన తర్లుపాడు మండలంలోని గానుగపెంటలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడు దస్తగిరి తెలిపిన వివరాల మేరకు.. రోజూమాదిరిగానే గురువారం రాత్రి గొర్రెల మందను దొడ్లో తోలాడు. శుక్రవారం ఉదయం నిద్రలేచి చూసేసరికి 7 గొర్రెలు మృతి చెంది, మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడి ఉన్నాయి. కలుజువ్వలపాడు వెటర్నరీ సిబ్బంది గానుగపెంట చేరుకుని గాయపడిన గొర్రెలకు చికిత్స చేశారు. సుమారు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

చీరాలలో భారీ చోరీ

- సుమారు 15 సవర్ల బంగారం ఆభరణాలు చోరీ

చీరాల: పట్టణంలోని విఠల్‌నగర్‌లోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... చీరాల పట్టణంలోని విఠల్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి రజని ఇంటిలో ఒంటరిగా నివసిస్తోంది. పది రోజుల క్రితం బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పసిగట్టిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటి పనిమనిషి తలుపులు పగలకొట్టి ఉండడం చూసి పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటిలోని వస్తువులు చిందర వందరగా పడివేయగా క్లూస్‌టీం సిబ్బంది ఇంటిలోని వస్తువులపై వేలిముద్రలు సేకరించారు. ఇంటిలో ఉంచిన బంగారం చోరీకి గురైందని, సుమారు 15 సవర్ల వరకు బంగారం ఉంటుందని రజని ఫోన్‌లో తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోగిన ఓబీఏ ఎన్నికల నగారా


షెడ్యూల్ విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి పీవీఎస్ గుప్తా

ఒంగోలు: ఒంగోలు బార్ అసోసియేషన్ (ఓబీఏ) ఎన్నికల నగారా షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి పీవీఎస్ గుప్తా శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ హాలులో విడుదల చేశారు. మొత్తం 800కుపైగా ఓటర్లు ఉన్న బార్ అసోసియేషన్ ఎన్నికలో అధ్యక్ష స్థానానికి భారీగా పోటీ నెలకొంది. ఇప్పటికే ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ప్రకటించడం, షెడ్యూలు విడుదలైన దరిమిలా ఇంకా ఎంతమంది అభ్యర్థులు పోటీకి ముందుకు వస్తారనేది ప్రస్తుతం న్యాయవాద వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ జిల్లా కోర్టు భవనాల సముదాయం ఆవరణలోని ఒంగోలు బార్ లైబ్రరీలో నిర్వహిస్తారు. ఎన్నికల ప్రక్రియ మాత్రం ఒంగోలు బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఓటర్లు, అభ్యర్థుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు ఎన్నికల అధికారులుగా కేఆర్ తిమోతి, డీఎస్‌కె చక్రవర్తి, బద్దిపూడి శ్రీనివాసరావులు వ్యవహరిస్తారు.

షెడ్యూలు ఇలా:

- ఏప్రిల్ 2వ తేదీ నామినేషన్లు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- ఏప్రిల్ 3వ తేదీ నామినేషన్ల పరిశీలన: సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు
- ఏప్రిల్ 4వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ: ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నిక నిర్వహణ తేదీ: ఏప్రిల్ 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. అనంతరం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించి ఎన్నికైన వారి జాబితాను విడుదల చేస్తారు.

నిబంధనలు షురూ..

అధ్యక్ష స్థానానికి పోటీ చేయాలంటే ఒంగోలు బార్ అసోసియేషన్‌లో కనీసం 20 సంవత్సరాల సభ్యత్వం ఉండాలి. ఉపాధ్యక్షులు 15 సంవత్సరాలు, ప్రధాన కార్యదర్శి 12 సంవత్సరాలు, సంయుక్త కార్యదర్శి 10 సంవత్సరాలు, మిగిలిన లైబ్రరీ సెక్రటరీ, కోశాధికారి, స్పోర్ట్సు అండ్ కల్చరల్ సెక్రెటరీకి 8 సంవత్సరాల సభ్యత్వం ఉండాలి. లేడీ రిప్రజెంటేటివ్‌కు మాత్రం సభ్యత్వం ఉంటే చాలు. అధ్యక్ష స్థానానికి పోటీ చేసే వారు రూ.5 వేలు, ఉపాధ్యక్షులు, లేడీ రిప్రజెంటేటివ్, ప్రధాన కార్యదర్శి పోస్టులకు రూ.4 వేలు, మిగిలిన పోస్టులకు రూ.3 వేలు చొప్పున నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

నేడు కాటమరాజుస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: జిల్లాలోనే అత్యంత పెద్ద తిరునాళ్లగా ప్రసిద్ధి చెందిన గుండంచర్ల సమీపంల నల్లమల్ల అడవిలో వెలసిన స్వయంభువుడు శ్రీ వేనూతల కాటమరాజు స్వామి, గంగాభవానీలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏటా ఉగాది పండగకు ముందు రోజు యాదవులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఆలయం ప్రాంగణంలో వరసిద్ధి వినాయకస్వామి, కాటకోటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించారు. భక్తులు వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. ఉదయం 6 గంటలకు అభిషేకం, అలంకరణ, తదితర పూజలు, రాత్రి గంట 10.15 నిలకు ఉత్సవ విగ్రహాలు ఆలయం చుట్టూ గ్రామోత్సవం, మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదానం చేస్తారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు, తాగునీటి సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామని ఆలయ చైర్మన్ పల్లెబోయిన వెంకటరాజు యాదవ్ తెలిపారు. భక్తుల కాలక్షేపానికి రాత్రి పలు పార్టీలకు చెందిన నాలుగు ఎలక్ట్రికల్ ప్రభలు, పాటకచ్చేరి, కోలాటం, డ్రామాలు ప్రదర్శించనున్నారు. తిరునాళ్ల సందర్భంగా గుండంచర్ల, కలనూతల, సుంకేసుల గ్రామాల్లో బంధువులు, స్నేహితులతో గృహాలు, వీధులు సందడిగా మారుతాయి. ఉగాది పండగ ముందు రోజు యాదవులు ప్రతి ఇంట్లో పొంగళ్లు తయారు చేసుకొని ఇలవేల్పు బొల్లావుకు సమర్పిస్తారు. అనంతరం గ్రామంలో ప్రత్యేక అలంకరణతో బొల్లావును ఊరేగింపుగా సందడి చేసుకుంటూ కాటమరాజుస్వామి ఆలయానికి సాయంత్రానికి చేరుకుంటారు.


పెద్దారవీడులో రంగులు వేసిన బొల్లావు ఆలయం

తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

తిరునాళ్లకు మార్కాపురం ఆర్టీసీ డిపో అధికారులు మార్కాపురం పట్టణం బాలికల ఉన్నత పాఠశాల నుంచి, గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు కంభం బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు నడుపుతుంటారు. ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల మండలాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తులు పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి గ్రామాల మీదుగా వెళ్తే ఆలయానికి త్వరగా చేరుకోవచ్చు.